గదిలో కూర్చుని చదువుకుంటున్నాడనుకొన్న బాబు – కంఠం బయట వీధిలో పిల్లలతో పాటు వినపడేసరికి చేస్తున్న పని వదిలిపెట్టి వరండాలోకి వచ్చేను. తెల్లవారితే వాడికి సైన్స్ పరీక్ష. సైన్స్‌లో వాడు చాలా డల్. వాడిని డాక్టర్‌ని చేయాలని నాకు చచ్చే ఉబలాటంగా వుంది. అందుకే వాడిని నాలుగు తన్ని అయినా సైన్స్‌లో ఫస్ట్ మార్కులు వచ్చేలా చదివించేయాలనుకుని "ఒరే శ్రీనూ..." అంటూ పిలిచేను. కాని వాడు నా పిలుపు వినే స్థితిలో లేడు. వీధిలో అందరి పిల్లలతో పాటు "హాయ్... హాయ్" అని ఆనందపడుతూ జారిపోతున్న లాగును ఓ చేత పైకి లాక్కుంటూ ఆకాశం వైపు తలెత్తి చూస్తూ ఎగురుతున్నాడు.

పిల్లలకింత సంబరాన్ని కలిగించేటంత ఆకాశంలో ఏమి వున్నదా? అనుకుని తలెత్తి చూసేను. గాలిపటాలు రెండు అలా అలా గాలిలో ఎగురుతున్నాయి. వాటితోపాటు ఈ పిల్లల మనసూ ఎగురుతోంది. అలా ఆనందంతో కేరింతలు కొట్టే పిల్లల్ని చూస్తుంటే నా మనస్సెలాగో అయిపోయింది. ఈ జీవితంలో అంతటి ఆనందాన్నీ, సంతోషాన్నీ, ఉత్సాహాన్నీ ఇచ్చే సంఘటన ఏదైనా జరుగుతుందా? అన్న ఆలోచనతోపాటూ, జ్ఞానోదయమూ అయింది. అంతటి వాడి ఆనందాన్ని పాడుచేసే అధికారం నాకు లేదనిపించింది. ఆ పసివాళ్ళలా నా మనసు కేరింతలు కొట్టకపోయినా వారి ఆనందంలో పాలుపంచుకుందామని అక్కడే నిలబడి వాళ్ళని గమనించసాగేను.



ఎక్కడో పైన ఆకాశంలో ఎగిరే గాలిపటాలను చూస్తూ పిల్లలు పిచ్చిగా ఉద్రేకపడిపోతున్నారు. 'ఒరే! ఫేంచ్... పేంచ్ పడిందిరోయ్! అరే డీల్... డిల్... డీల్ విడిచాడు రోయ్!" (ఫేంచ్ అంటే దారాలు ముడిపడటం, డీల్ అంటే ఒదులు చేయటమని అర్థం. ఈ గాలిపటాల పరిభాష హైదరాబాద్‌లో వింతగా వుంటుంది.) ఎక్కడో దూరాన ఎవరో ఇద్దరు ఎగుర వేస్తున్న గాలిపటాలని చూస్తూ ఇక్కడ ఈ పిల్లలు గొంతులు చించుకుని గాలిలోకి కేకలు వేస్తున్నారు.

"ఓయ్! తెల్లగాలిపటం మీద నల్లని చుక్కలు. ఎంత బావుందీ? బలే... బలే" అంటూ అరుస్తున్న శ్రీను దృష్టి ఎందుకో నా మీద పడింది. ఒక్కసారి వాడు గతుక్కుమన్నట్టుగా చూసినా, నా మొహంలోని ప్రసన్నతని గమనించేక వాడు తిరిగి ఆనందంగా మారిపోయేడు.

"అమ్మా! అమ్మా... చూసావా ఆ గాలిపటం ఎంత బావుందో! ప్లీజ్! అమ్మా!... నాకలాటి గాలిపటం కొని పెట్టవూ?..." వాడు దగ్గరకు వచ్చి మారాం చేస్తూ అడిగేడు.

"ఓ! యస్. కొనిస్తాను. ముందు పరీక్షలు కానీయి" అన్నాను అప్రయత్నంగా. అంతే సంతోషంగా ఒడ్డుకు కొట్టుకుని వచ్చిన కెరటం తీరం తాకిడికి వెనక్కు విరుచుకుపడ్డట్టు. పరీక్షల మాట వింటూనే వాడు తుర్రుమని పిల్లల మధ్యకి పారిపోయేడు. ఉన్నట్టుండి పిల్లలంతా "అఫా" "అఫా" అని గగ్గోలు పెట్టసాగేరు.

నల్లచుక్కలున్న తెమ్మగాలిపటం తెగిపోయి, నిరాధారంగా గాలితోపాటూ తేలిపోతున్నది. 'తెల్లగాలిపటం' "అయ్యో! అది వాది" నాదంటూ వారి వెంట పరుగు లంకించటం చూసి ఇక ఉపేక్షించి లాభం లేదని "ఒరే శ్రీనూ! ఇటు రా ముందూ!" అంటూ వెంట పడ్డాను.

ఈ గాలి పటాల కోసం పిల్లలు అర్థాంతరంగా పరుగులు తీసి రైళ్ళ క్రింద, బస్సుల క్రింద పడి చావు కొని తెచ్చుకోవటం వింటూనే వుంటాము. ఆ గాలిపటం అలా గాలిలో గిరికీలు కొట్టి మా ఇంటి ఎదురుగా వున్న లాయరుగారింట్లోనే పడబోతున్నది. అటే చూస్తూ "అరేయ్! దాన్నెవరైనా ముట్టుకుంటే తంతా!... అది నాది నాది" అంటూ రోడ్డు దాటబోతున్న శ్రీనుని పట్టుకుని "తంతావు వెధవా! పిచ్చెక్కిందేమిటిరా నీకు?... ఆ గాలిపటం నీదంటావేమిటి?" చిరాకుగా అన్నాను.

"ష్!... ఊరుకోమ్మా! అది నాదంటే, వాదే! చూడు ఎలా లాక్కొస్తానో! ఆ గాలిపటాన్ని" అని గమ్మత్తుగా నవ్వి, నా చేయి విదిలించుకుని లాయరుగారి కాంపౌండులోకి పరుగెత్తాడు శ్రీను.

కాసేపటికి పిల్లల మధ్య నుండి మావాడి గొంతు పెద్దగా వినిపించింది "అది నాదంకుల్. మా నాన్న కొనిపెట్టేరు. నాది... నాకిచ్చేయండి. అప్పుడే అఫా చేసానంటే మా నాన్న తంతారు కూడా" నమ్మకంగా దబాయించేస్తున్నాడు.

నేను నిశ్చేష్టురాలినై అక్కడే నిలబడి ఆ తతంగాన్ని అంతా చూస్తున్నాను.

అతను లాయరు కదా! పిల్లల్ని క్రాస్ ఎగ్జామ్ చేస్తున్నారు.

పిల్లలు తలా ఒక విధంగా చెవుతున్నారు. కొందరు పిల్లలైతే ఆ పెద్దమనిషి అడుగుతుంటే భయంతో బిక్కచచ్చో, సిగ్గుతో నోరు తెరవలేకో మౌనంగా అన్నిటికీ తలలాడించేసేరు.

కాని, శ్రీను మాత్రం తను పట్టుకున్న కుందేటికి మూడే కాళ్ళన్నట్టు తన మాట మీంచి జారటం లేదు. "అది నాది. నాది. మా నాన్నకొనిచ్చేరు" అబద్దం. పైగా ధైర్యంగా దబాయింపు. ఆ ధైర్యం, ఆ మాటకారితనం, తిమ్మినైనా బమ్మిని చేయగల ఆ శక్తీ, ఆ చురుకూ, చూసి లాయరుగారు కూడా బెంబేలు పడిపోయి వుంటారో! లేక వాడిదే అని నమ్మేరోకాని వాడి చేతికి గాలిపటాన్ని ఇచ్చివేసేరు.

నేను గిరుక్కున వెనుదిరిగి ఇంట్లోకి వచ్చేను. వెనక్కి చూడకపోయినా శ్రీను మొహంలోని విజయగర్వం నా కళ్ళకి కట్టినట్టు కనిపిస్తున్నది. అర నిమిషం క్రితం అమాయకంగా మెరిసే వాడి కళ్ళలో విచిత్రమైన తెగింపుని చూసేను. ఆ తెగింపుతో తాను కోరినది సాధించడంలోనూ తప్పు లేదు. కానీ అది




సాధించటానికి వక్రమార్గాన్ని అనుసరించడమే తప్ప.

పరీక్షల్లో కాపీకొట్టి క్లాసు తెచ్చుకునే మూర్ఖులూ, మెరిట్‌వారి ముందు నుండే రికమండేషన్‌తో ఉద్యోగాలను తన్నుకుపోయే గ్రద్దలూ, ఎదుటి వ్యక్తి అవసరాన్ని ఆధారంగా చేసుకుని వల్ల డబ్బు పోగుచేసుకునే రాబందులూ, ఓట్లను కొని ప్రజల రక్తమాంసాలతో వ్యాపారం చేసుకోగల నాయకులు వున్న రాజ్యమూ, దేశమూ ఇది! ఆ బ్రతకనేర్చిన వ్యవహారం మా శ్రీనుకి పట్టుబడిందని ఆనందించనా?

"ఊహూ. ఎందుకో నా మనసు ఎదురుతిరుగుతోంది."

ఇలా ఇలా ఇంకెంత కాలం? ఈనాడు, రేపు, ఆ తరువాత, ముందు తరంలోనూ న్యాయాన్ని, ధర్మాన్నీ కాదని మసిపూసి మారేడు కాయని చేసే వాళ్ళవే రోజులుగా అందినంత వరకూ చాకచక్యంగా దోచేవాడిదే రాజ్యంగా జరగవలసిందేనా?

శ్రీను ఇంట్లోకి వచ్చి బీరువా దగ్గరికి కుర్చీ జరుపుకుని దాని పైకెక్కి బీరువా మీద గాలిపటాన్ని వుంచి, అది ఎగిరిపోకుండా తనదో గట్టి నోటు పుస్తకం బరువుగా దాని మీద వుంచాడు. వాడు చేస్తున్నదంతా ఏకాగ్రతతో చూస్తున్న నన్ను – "ఆంటీ" అంటూ కిటికీలోంచి ఒక అమ్మాయి పిలిచింది. "ఆంటీ! మీ శ్రీను గాలిపటాన్ని దొంగతనం చేసేడు కదా!" అందా అమ్మాయి.

ఏమనగలను నేను? శ్రీను మాత్రం చేస్తున్న పని ఆపి గిరుక్కున వెనక్కి తిరిగేడు. కిటికీ వద్ద చేరిన పిల్లలు వెనక్కి తగ్గేరు.

అయినా దూరం నుండి మా ఇంట్లోకి కుతూహలంగా చూస్తూనే వున్నారు. శ్రీను తప్పు చేశాడు. అది వీరికి తెలుసు. అదికాదు విషయం. ఆ తప్పుని తల్లినైన నేను ఎలా స్వీకరిస్తానో? అని వారంతా వేచి చూస్తున్నారన్న ఊహ కలిగింది. శ్రీను కూడ జస్టిస్ కోసం నేను ఇవ్వబోయే తీర్పు కోసం, తహ తహలాడిపోతున్నాడని వాడి మోహం చూస్తూనే తెలుస్తున్నది. అందులో ఆ అమ్మాయి దొంగ అనటం వాడి మనసు మీద ప్రభావం చూపింది. ఇదే సమయమనుకుని –

"చూసేవా? నీవు ఆ గాలిపటం" అని మొదలుపెట్టబోయేనో లేదో "బావుంది కదమ్మా! లాయరుగారింట్లో మునగ చెట్టుకి చిక్కుకున్నా చిరగలేదు. అమ్మా! ఈ సైన్స్ పరీక్షేగా చివరిది. చూస్తుండు రాత్రికి బాగా చదివి రేపు పరీక్ష వ్రాసేస్తా! ఆ మరునాటి నుండి సెలవులు. అమ్మా! సెలవుల్లో తాతగారింటికి వెళ్ళి డాబా మీద నుండి గాలిపటాలెగరవేస్తాను."

శ్రీను తన మాటలతో నన్ను మభ్యపెట్టి, తనూ రిలీఫ్ పొందాలని చూస్తున్నాడు. "అది సరే శ్రీనూ! లాయరుగారికి అబద్ధం చెప్పి ఆ గాలిపటాన్ని ఎందుకు తెచ్చేవు?" అన్నాను కోపంగా.

"నేను అబద్ధం ఏమీ చెప్పలేదమ్మా!" గతుక్కుమన్నాడు వాడు.

"లేదూ? గాలిపటం నీదని అబద్ధం చెప్పేవు. అందుకేగా వాళ్ళంతా నిన్ను దొంగ అంటున్నది" అన్నాను.

"ఎవరా అనేది?... నేను లాయరుగారింట్లో దొంగతనం చేయలేదు. తెగిన గాలిపటం లాయరుగారు మొన్న వాసుకివ్వలేదూ! ఇవ్వాళ నాకిచ్చారు" అన్నాడు బింకంగా.

"నీకివ్వలేదు. నీవు దొంగ మాటలు చెప్పి తెచ్చేవు. అవునా?" అన్నాను గద్దిస్తూ. వాడి బింకం సడలింది.

"నాకేం! రేపటి నుండి వీధిలో పిల్లలంతా నన్ను దొంగ అంటారు" అవతలగా వున్న పిల్లలని చూశాడు. వాడి కళ్ళలో బెదురు. తప్పు చేశానన్న భావం.

"వాళ్ళంతా మంచివాళ్ళలా పోజులు కొడుతున్నారు. చూడూ! నీవు మాత్రం అబద్ధాలు చెప్పి గాలిపటం దొంగలా తెచ్చేసుకున్నావు" వాడిని కిందపరుస్తూ అన్నాను.

"ప్చ్!... ఆ గాలిపటాన్ని చింపిపడేస్తాను చూడు" అన్నాడు ఉక్రోషంగా.

"వద్దు. చక్కని గాలిపటం చింపట మెందుకు?"

"మరి పోనీ ఆ రాముగాడికి ఇచ్చేయనా అమ్మా!"

దానిని వదిలించుకుని వచ్చిన అపవాదు తొలిగించుకోవాలన్న దుగ్ధ బయలుదేరింది వాడిలో.

"మధ్యన వాడికివ్వటమెందుకు? అది వాడిది కాదు కదా!" అన్నాను.

"మరేం చేయనమ్మా!" అన్నాడు బేలగా. వాడి హృదయం భారంగా తయారయింది.

"ఆ గాలిపటాన్ని తీసుకురా! అలాగే దారం కూడా తీసుకో. పద డాబా మీద కెళ్దాం" అంటూ పైకి దారి తీశాను. పైకి వెళ్ళేక "దారం కట్టి ఎగురవేయి" అన్నాను. నాకు పిచ్చిగాని పట్టలేదు కదా! అన్నట్టుగా చూసేడు. గాలిపటం గాలిలోకి లేచింది. చక్కటి గాలి వుండడంతోనేమో కొద్ది నిమిషాల్లో పైకి వెళ్ళింది.

"శ్రీను ఇప్పుడు దారం తెంపేయి. తెగిన గాలిపటం న్యాయంగా ఎవరు పట్టుకుంటారో వారిదవుతుంది" అన్నాను.

శ్రీను మోహంలోకి ఉత్సాహం పొంగుకుని వచ్చింది. దారాన్ని తెంపేసి "అఫా!" (తెగింది) అని పెద్దగా అరిచేడు. పిల్లలంతా "అఫా! అఫా!" అంటూ దాని వెనకే పరుగెత్తారు.

"ఒరే రామూ! మీ కోసమే వదిలేశాను. ఎవరికి దొరికితే ఇప్పుడు వారు తీసుకోవాలి" పెద్దగా అరిచి చెప్పాడు శ్రీను.

"అమ్మా! నేనూ వెళ్ళనా" పరుగున పోబోతూ ఆగి అడిగాడు. పిల్లలలా గాలిపటాల వెనక పరుగులు పెట్టడం నా కిష్టం వుండదు. అయినా గత్యంతరం లేక "వెళ్ళు కానీ, జాగ్రత్త!" అన్నాను. శ్రీను మెరుపులా మాయమయ్యేడు. కొంతసేపటికి వారంతా ఉత్తిచేతులతో తిరిగి వచ్చారు. అయినా వారి మొహాల్లో నిరాశ లేదు. అంతా కలిసి నవ్వుతూ తుళ్ళుతూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అవును కష్టాన్నయినా, సుఖాన్నయినా నలుగురితో పంచుకోవడంలో ఆనందముంది. అందరి సంతోషాన్ని కొల్లగొట్టి తానొక్కడే అనుభవించడంలో తృప్తి, ఆనందం వుంటుందనుకోవడం పొరపాటు అనుకున్నాను.